క్లుప్తంగా

లాలుపురంలో స్వచ్ఛ ఆంధ్ర దివస్



గుంటూరు రూరల్: స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని లాలుపురం గ్రామపంచాయతీలో ప్రజలకు తడిచెత్త, పొడిచెత్త గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి చెత్త బుట్టల్లో తడిచెత్త, పొడిచెత్తను ఏవిధంగా విడివిడిగా వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలో వివరించారు. అదే విధంగా తడి చెత్త, పొడి చెత్త హానికరమైన వస్తువులను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తులు

పొన్నూరు: పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏకా పవన్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. ఈనెల 21వ తేదీ వరకు బయోడేటాలను పొన్నూరు న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి పోస్టు ద్వారా కాని, స్వయంగా అందజేయాలని తెలిపారు.

బహిరంగ వేలం వాయిదా

పెదకాకాని: శివాలయంలో ఈ ప్రొక్యూమెంట్ టెండర్, సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం వాయిదా వేసినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ లైసెన్స్ హక్కులు పొందేందుకు ఈనెల 17వ తేదీన బహిరంగ వేలం నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తాత్కాలికంగా ఈ వేలం వాయిదా వేసినట్లు వివరించారు. ఆలయంలో లైసెన్స్ హక్కులకు ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం వేలం తేదీని ప్రకటించనున్నట్లు డీసీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు బైక్‌లు ఢీకొని మహిళ గాయపడిన ఘటన మండలంలోని నారాకోడూరు గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. తెనాలి ప్రాంతానికి చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై తెనాలికి బయలు దేరారు. మార్గమధ్యలో నారాకోడూరు గ్రామ పరిధిలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఢీ కొట్టారు. ఈ ఘటనలో నిర్మలకు తలకు, కాళ్లు, చేతులకు గాయాలైనాయి. బాధితురాలిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ హయాంలో గిరిజనులకు అన్యాయం

పొన్నూరు: గిరిజనుల సంక్షేమాన్ని టీడీపీ పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి యందేటి వెంకటసుబ్బయ్య ఆరోపించారు. టీడీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు దారు నాయక్ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను వెంకట సుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన కేబినెట్‌లో గిరిజన శాఖకు మంత్రిని నియమించని కారణంగా గిరిజనులకు అన్యాయం జరిగిందని అన్నారు. గిరిజనుల వర్గానికి చెందిన ఎమ్మెల్యేలను కూడా చంద్రబాబు గెలిపించలేదని మండిపడ్డారు. రానున్న బడ్జెట్‌లో గిరిజనుల సంక్షేమం కోసం అధికంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సెయింట్ ఆన్స్‌లో కామర్స్‌ఫెస్ట్


గుంటూరు రూరల్: వర్క్‌షాపుల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య తెలిపారు. గురువారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో నిర్వహించిన అంతర కళాశాలల కామర్స్‌ఫెస్ట్‌లో 60.కామ్ ఇగ్నైట్ 25లో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.త్యాగరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్‌రోజ్, అధ్యాపకులు జె.ప్రమీలారాణి, ఎం.అంజనాదేవి, జి.సరోజ, షేక్ సుభాని పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుంటూరు రూరల్: రూరల్ మండలం సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు.

తాగునీటి కుళాయిల్లో

అవినీతి ధార



- పేదలను దోచుకుంటున్న టీడీపీ కార్యకర్తలు
- ఉచిత కుళాయి కనెక్షన్‌కు రూ.4500-5000 వసూలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

గుంటూరు రూరల్: తాగునీటి కుళాయిలలో అవినీతి రాజ్యమేలుతోంది. కార్పొరేషన్ పరిధిలో ఉచిత తాగునీటి కుళాయి పథకాన్ని ధనార్జనకు వాడుకుంటున్నారు. 41వ డివిజన్‌లో టీడీపీ కార్యకర్తలు ఇంటింటికి తాగునీటి కుళాయిలు ఇప్పిస్తామని చెప్పి అందిన వరకు దోచుకుంటున్నారు. కుళాయి నిమిత్తం రూ.4,500 నుంచి 5000 వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. అదేమని అడిగిన వారిని కుళాయి ఎలా వస్తుందో చూస్తామని బెదిరించిన ఘటనలు లేకపోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డివిజన్ పరిధిలో..

నగర పాలక సంస్థ ఉచిత తాగునీటి కుళాయి పథకంలో భాగంగా ప్రభుత్వం ఇంటింటికి కుళాయిని అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని రామాంజనేయకాలనీ, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాలకు కుళాయి సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వం ఇంటింటికి ఉచిత తాగునీటి కుళాయి పథకంలో నామమాత్రం చలానాతో కుళాయిని అందించాల్సి ఉంది. టీడీపీ కార్యకర్తలు మాత్రం పథకాన్ని సొమ్ము చేసుకుని సుమారు రెండు కాలనీల్లో 5,000 కుటుంబాల వద్ద నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.5000 వేల వరకూ వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇంటి పన్నులకు వసూలు..

పేదల సొంతింటికలను సాకారం చేసుకునే క్రమంలో స్థానికంగా ఉన్న పేదలు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. రాజీవ్‌గృహకల్పలో ఇంటి పన్నులు వేయిస్తామంటూ ఒక్కొక్క ఇంటి నుంచి రూ.8,000 చొప్పున వందలాది మంది వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం. రాజీవ్ గృహకల్పలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిపన్ను రూ.270 ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించి రసీదు పొందాల్సి ఉంది. అయితే టీడీపీ కార్యకర్తలు మాత్రం ఒక్కొక్కరి వద్ద రూ.8,000 వసూలు ఆగ్రహం వ్యక్తమవుతోంది. అదే విధంగా టిడ్కో నివాసాలకు వచ్చిన ప్రజల వద్ద నుంచి ఇంటి పన్నుగా ప్రభుత్వానికి రూ.52 చెల్లించాల్సి ఉంది. కానీ రూ.1,800 వరకూ వసూలు చేశారని, ఇవ్వకపోతే వచ్చే నెలలో ప్రభుత్వ స్థలాలు, ఇళ్లపై సర్వే ఉంటుందని ఆ సర్వేలో మీ ఇంటిని వేరేవారికి రాయిస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే సిబ్బంది స్థానిక టీడీపీ నాయకులకు చెప్పి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఇదే విషయంపై స్థానిక ఎమ్మెల్యేకి ప్రజలు ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే సమక్షంలో పంచాయితీ జరిగినట్లు సమాచారం.

ఉన్నత లక్షణాలతోనే విజయాలు సాధ్యం

కాకినాడలోని జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్ మురళీకృష్ణ

చేబ్రోలు: ఉన్నత లక్షణాలతోనే విజయం సాధ్యమవుతుందని, విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఎటువంటి చెడు లక్షణాలకు బానిసలు కాకూడదని కాకినాడలోని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో "జాయ్ ఆఫ్ ఇంజినీరింగ్" అనే అంశంపై గురువారం మొదట సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవిత కాలం విద్యార్థిగా ఉండాలని, ఎల్లప్పుడు పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. వివిధ బహుళ జాతి సంస్థలలో ఉద్యోగాలు సాధించిన 341 మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాకినాడ జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ మురళీకృష్ణ

విజ్ఞాన్ నిరులలో జాతీయ మహిళా దినోత్సవం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సరోజినినాయుడు జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ కాకినాడ వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సరోజినినాయుడును ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రాధాన్య క్రమంలో చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగర పరిధిలో అభివృద్ధి పనులను స్థానిక ప్రజల అవసరాల రీత్యా ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదర్శ నగర్, ఏటీ అగ్రహారం, పెద్ద పలకలూరు, స్వర్ణాంధ్ర నగర్, తారకరామ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ చేపట్టిన పనుల్లో జాప్యం జరిగితే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని, పనులను నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయడానికి బాధ్యత తీసుకోవాలన్నారు. ఇప్పటికే నగరంలో నిర్మించిన సిమెంట్ రోడ్లు, డ్రైయిన్ల నాణ్యతపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. బిల్లుల చెల్లింపు చేయడానికి ముందుగా ప్రతి పనిని పూర్తి స్థాయి పరిశీలన చేస్తామని, అందులో నాణ్యత లోపాన్ని గుర్తిస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈలు మధుసూదన్, రమేష్ బాబు, ఆర్ఓ రవి కిరణ్ రెడ్డి, ఎస్ఎస్ లు ఆనంద కుమార్, సోమశేఖర్ పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

ఏడుగురు అడ్మిన్ సెక్రటరీలు సస్పెన్షన్

నెహ్రూ నగర్: నగరంలో ఆస్తి పన్ను వసూలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని, వారం రోజుల్లో జీరో వసూలు చేసిన ఏడుగురు అడ్మిన్ కార్యదర్శులను విధుల నుంచి సస్పెండ్ చేయాలని, పర్యవేక్షణ లోపంపై నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం అధికారులతో ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఎం. నాగరాజు(14), డి.జయలక్ష్మి(7), ఎస్.కె.బి.అరుణ్ కుమార్(154), జె.పవన్ కుమార్(191), కె.కామేశ్వర రావు(163), షేక్ షబీన (40), జి.రేవంత్ నాగసాయి(60) అడ్మిన్ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఖజావలి, కాశయ్య, సుబ్బారావు, నాగరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. దీర్ఘకాలం బకాయిలు ఉండి చెల్లించని కమర్షియల్ సంస్థలను చట్ట ప్రకారం పంచనామా జరిపి సీజ్ చేయాలని చెప్పారు. డెప్యూటీ కమిషనర్లు ప్రతి రోజు పన్ను వసూలు పురోగతిపై సమీక్షించి ఏదో ఒక ప్రాంతంలో వసూళ్లలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటి కమిషనర్లు సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఆర్.ఓ.లు రవికిరణ్ రెడ్డి, సాదిక్ బాషా, రెహమాన్, మదన్ గోపాల్ పాల్గొన్నారు.

బైక్ ఢీ కొని విద్యార్థికి గాయాలు

చేబ్రోలు: పాఠశాలకు వెళ్తున్న మూడో తరగతి విద్యార్థిని గుర్తు తెలియని బైక్ ఢీ కొట్టడంతో గాయపడిన ఘటన గురువారం చేబ్రోలు మండలం నారా కోడూరు వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. నారాకోడూరు సీఎంఎస్ హాస్టల్‌కు చెందిన పి.మహేష్ నారాకోడూరులోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం హాస్టల్ నుంచి పాఠశాలకు రోడ్డు వెంట వెళ్తున్న మహేష్‌ను వేగంగా వచ్చిన గుర్తు తెలియని బైక్ ఢీ కొట్టి వెళ్లిపోయింది. కాలు విరిగిన మహేష్‌ను వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు 108లో తరలించినట్లు వార్డెన్ కె.రమేష్ తెలిపారు.

స్వర్ణభారతినగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు రూరల్: నగరంలో ని 41వ డివిజన్ స్వర్ణ భారత నగర్ లో శంకర కంటి ఆస్పత్రి- అంధత్వ నివారణ సంస్థ, అఖిల భారత యువజన సమాఖ్య నగర సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్లా మరియదాస్, సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

గుంటూరు రూరల్: తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పూర్ణకుమార్(20) పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడని తల్లి బుధవారం మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన పూర్ణకుమార్, తల్లిని పనికి వెళ్లొచ్చి ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పని నుంచి ఇంటికి వచ్చిన తల్లి ఇంట్లో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన విషయం చూసి పోలీసులకు సమాచారం అందించింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో 'షబ్ ఏ బరాత్'

పొన్నూరు: పొన్నూరులో షబ్ ఏ బరాత్ (బడీ రాత్) పండుగను గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక నమాజ్, రాత్రంతా జాగారం చేసి ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిలందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో నమాజ్ చేసి దువాలో తాము చేసిన పాపాలను క్షమించమని అల్లాహ్‌ను హృదయ పూర్వకంగా వేడుకున్నారు. సర్వశ్రేమం తుదైన అల్లాహ్. మానవులందరి భవిష్యతుకు ఈ రాత్రి మార్గనిర్దేశం చేస్తారని ముస్లింలు విశ్వసిస్తారు. ప్రార్థనల అనంతరం కబరస్థాన్‌కు వెళ్లి పూర్వీకులను స్మరించుకున్నారు.

వీవీఐటీకి ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్

పెదకాకాని: సాంకేతిక ఆవిష్కరణ, వ్యవస్థాపకత, డిజైన్ థింకింగ్‌లను పెంపొందించేందుకుగాను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రారంభించిన ప్రతిష్టాత్మక ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్(ఐడియా డెవలప్మెంట్ ఎవల్యుషన్ అండ్ అప్లికేషన్)ను వీవీఐటీ కళాశాలకు కేటాయించడం జరిగిందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో గురువారం చైర్మన్ మాట్లాడుతూ సాంకేతిక విద్యా సంస్థల యొక్క నాణ్యమైన విద్యాప్రమాణాలు, ఆవిష్కరణలలో చేస్తున్న కృషికి గుర్తింపుగా దేశ వ్యాప్తంగా సాంకేతిక విద్యాలయాలలో ఏఐసీటీఈ 113 ల్యాబ్‌లను ఏర్పాటు చేయగా వీవీఐటీ కళాశాల ఒకటన్నారు. ఈ ల్యాబ్ కొరకు ఏఐసీటీఈ వీవీఐటీ కళాశాలకు 90 లక్షలు కేటాయించిందని పేర్కొన్నారు. సాంకేతిక విద్యలో అనుభవపూర్వక అభ్యాసం, వ్యవస్థాపకత, ఆవిష్కరణల రూపకల్పన దిశగా విద్యార్థులను ప్రోత్సహించడం ఈ ల్యాబ్స్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్స్ సృజనాత్మకత, సాంకేతికతను వినియోగించి వాస్తవ ప్రపంచ సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా పరిశ్రమ అవసరాలకు తగినట్లుగా విద్యార్థులను సన్నద్ధం చేయడం, నిపుణుల సలహాలు అందించడం జరుగుతుందని చెప్పారు. రోబోటిక్స్, 3డీ ప్రింటర్స్, ఐఓటీ కిట్స్ వంటి అధునాతన సాంకేతిక సాధనాలు ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రాజెక్ట్ చీఫ్ మెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, కోర్డినేటర్‌గా డాక్టర్ ఎంవై భానుమూర్తి, కో కోర్డినేటర్‌గా డాక్టర్ టి.శ్రీనివాసరావు వ్యవహరించనున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు.



ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ ధ్రువీకరణ పత్రాన్ని కోఆర్డినేటర్‌కు అందజేస్తున్న చైర్మన్ విద్యాసాగర్

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్

కొమ్మూరు(కాకుమాను): ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే భవిష్యత్ బంగారు మయమవుతుందని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్షల ఎలా సిద్ధపడాలని అనే అంశాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ మరో వంద రోజుల్లో పది పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి నుంచే ప్రతి విద్యార్థి ప్రణాళికను సిద్ధం చేసుకుని కష్టపడి చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఇంటికి వెళ్లిన తరువాత మళ్లీ మననం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు కూడా ఈ వంద రోజులు విద్యార్థులను పరీక్షల్లో ప్రతిభ చూపి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్, హెచ్ఎం రంగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

భూసమస్యల శాశ్వత పరిష్కారానికే రీ సర్వే

పొండ్రపాడు(కాకుమాను): గ్రామాలలో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. మండలంలోని పొండ్రపాడులో నిర్వహిస్తున్న భూ రీ సర్వేను గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని గ్రామాలలో భూ రీ సర్వే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రైతులు తమకు సంబంధించిన భూ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఆయా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ, గ్రామ సర్వేయర్లు సమన్వయంతో పనిచేసి భూ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ బి.వెంకటస్వామి, మండల సర్వేయర్ నాగరాజు ఉన్నారు.

మంచాల గ్రామంలో...

మంచాల(చేబ్రోలు): భూముల రీ సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా సిబ్బంది పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బార్గవ్ తేజ అన్నారు. చేబ్రోలు మండలం మంచాలలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వే పనులను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 783.15 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 565.18 ఎకరాలు పూర్తిచేసినట్లు చెప్పారు. ఆయన వెంట తహసీల్దారు కే శ్రీనివాసశర్మ, వీఆర్వో నాగమల్లేశ్వరరావు, సర్వేయర్ సాయి పాల్గొన్నారు.



పొండ్రపాడులో రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

ఆప్కాస్ ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధం కావాలి

గుంటూరు మెడికల్: ఆప్కాస్ ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధం కావాలని పారా మెడికల్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రమేష్‌బాబు, జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం జీజీహెచ్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగిస్తే 1.20 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతారన్నారు. ఆప్కాస్ వ్యవస్థ ఉండడం వలన ప్రతినెలా 1న జీతాలు, సకాలంలో పీఎఫ్‌లు తీసుకుంటున్నారని చెప్పారు. ఆప్కాస్‌ను రద్దుచేస్తే సహించేది లేదన్నారు. ఆప్కాస్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే ఎన్నికల కోడ్ తర్వాత ప్రభుత్వంపై ఉద్యమ పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ నందిగామ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె.పాచ్చా, జాయింట్ సెక్రెటరీ స్నేహ, జానీ బాషా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నాగు నాయక్, బసవ సాంబయ్య, జేఏసీ జిల్లా చైర్మన్ బి.లక్ష్మణరావు, జేఏసీ జనరల్ సెక్రెటరీ ముత్యాల రావు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు చేసే ఆలోచన ఉపసంహరించుకోవాలి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసే ఆలోచన ఉపసంహరించుకోవాలని ఐక్య వేదిక జిల్లా చైర్మన్ చాంద్‌బాషా అన్నారు. గురువారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో చాంద్‌బాషా మీడియాతో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆప్కాస్ విధానాన్ని ప్రభుత్వం చేస్తున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగర శాఖ ఉపాధ్యక్షుడు నాగూర్‌వలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, కోశాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.రమేష్‌బాబు, జేఏసీ చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు తదితరులు

తులసి సీడ్స్ ఫ్యాక్టరీ సందర్శన

కొరిటెపాడు(గుంటూరు): కె.ఎల్. విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల నుంచి అగ్రికల్చరల్ బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు విజ్ఞాన సందర్శనలో భాగంగా అమీనాబాద్‌లోని తులసి సీడ్స్ ఫ్యాక్టరీని గురువారం సందర్శించారు. వర్సిటీ నుంచి జన్యుశాస్త్రం- మొక్కల పెంపకం విభాగం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సుష్మా రాజ్ చెల్లెం, జి.సాయి వంశీరెడ్డి, కావూరి కల్పన, అసోసియేట్ ప్రొఫెసర్ (పాథాలజీ) డాక్టర్ పి.సెంథిల్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు. తులసి సీడ్స్ ఫ్యాక్టరీ సందర్శన వలన తమ విద్యార్థులు హైబ్రిడ్ విత్తనోత్పత్తికి సంబంధించి ఎన్నో విశేషాలను తెలుసుకున్నారని, వారి చదువుకి ఈ విజ్ఞానం మరింత దోహదపడుతోందన్నారు. ఫ్యాక్టరీ విజ్ఞాన సందర్శనకు అనుమతించిన తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్రలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



సీడ్ ప్రాసెసింగ్‌పై తెలుసుకుంటున్న కె.ఎల్.వ్యవసాయ కళాశాల విద్యార్థులు

మదిని సేదదీర్చే వాయులీనం

- వయొలిన్ విద్వాంసుడు యల్లమందరాజు కళాప్రతిభ
- నేడు సంస్మరణ సభ

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలికి ఖ్యాతిని తీసుకొచ్చిన సంగీత కళాకారుల్లో ప్రముఖ వయొలిన్ విద్వాంసుడు కూరపాటి యల్లమందరాజు ఒకరు. నాలుగు దశాబ్దాలకు పైగా ఎన్నో జాతీయ వేదికలపైన రాణించిన కళాకారుడు. ఎందరో జాతీయస్థాయి ప్రతిభావంతులైన కళాకారులకు వాయిద్యసహకారం అందించారు. ఆయా ప్రదర్శనలను తన కళాప్రతిభతో రక్తికట్టించారు. నేడు తెనాలిలో ఆయన సంస్మరణ సభ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యల్లమందరాజును స్మరించుకుందాం.

యల్లమందరాజు స్వస్థలం కారంపూడి మండలం భట్లువారిపల్లె. 1932 డిసెంబరు 5న జన్మించారు. తర్వాతికాలంలో సంగీత కళాకారుడుగా తెనాలిలో స్థిరపడ్డారు. చిన్నతనం నుంచీ సంగీతంపై అభిరుచి కలిగిన యల్లమందరాజు, కాజన విశ్వరూపాచార్య భాగవతుల వద్ద ప్రాథమిక అభ్యాసం చేశారు. భీమవరంకు చెందిన చదలవాడ సత్యనారాయణ, ఆకాశవాణిలో పనిచేసిన సంగీత విద్వాంసుడు 'నాదసుధార్ణవ' అన్నవరపు రామస్వామి దగ్గర వాయులీన సంగీతాన్ని అభ్యసించారు. 1962లో స్వగ్రామంలో కూరపాటి గోపరాజు భాగవతులు ఏర్పాటుచేసిన 'సీతారామకళ్యాణము'కు తొలిసారిగా వాయిద్య సహకారం అందించారు. అందరి ప్రశంసలు అందుకున్నారు.

అప్పట్నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సోలో కచేరీలు చేశారు. 1982లో మచిలీపట్నంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో మంగళంపల్లి బాలమురళీకృష్ణ గాత్ర సంగీత కచేరికి వాయులీన్ సహకారం అందించటం తన జీవితంలో మరపురానిదిగా చెప్పేవారు యల్లమందరాజు. 1964 నుంచి ఆకాశవాణి, విజయవాడ కేంద్రం నిర్వహించిన ఓబీ కార్యక్రమాల్లో లలిత సంగీత కచేరిలకు, సోలో కచేరీలు, ఓకల్ కాన్సర్టుల్లో పాల్గొన్నారు. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, విశాఖ వంటి నగరాల్లోనూ కచేరీలు నిర్వహించారు. వాయులీన విద్వాంసుడిగా తన ప్రత్యేకతతో జాతీయ కళాకారుడిగా గుర్తింపును పొందారు. అనేక సత్కారాలను, గౌరవాలను అందుకున్నారు. కళల కాణాచి తెనాలిలో నివసిస్తూ వచ్చిన యల్లమందరాజు 2003 ఫిబ్రవరిలో కన్నుమూశారు.



కూరపాటి యల్లమందరాజుకు సత్కారం (ఫైల్)

నేడు వయొలిన్ విద్వాంసుడి సంస్మరణోత్సవం

తెనాలి: వయొలిన్ విద్వాంసుడు కూరపాటి యల్లమందరాజు సంస్మరణోత్సవం శుక్రవారం జరగనుంది. ఆహ్వానపత్రికను గురువారం స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీగోవర్ధనస్వామి దేవస్థానంలో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఆలయప్రాంగణంలో ఏర్పాటయ్యే సభకు సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షత వహిస్తారు.